క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ



తెనాలి అర్బన్: మున్సిపాలిటీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి 6వ వార్డు కౌన్సిలర్ కొ్రపాటి లక్ష్మి శ్రీనివాస్ బుధవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మొవ్వా సత్యానారాయణ, మానికొండ మహేష్, తులసీ, కొ్రపాటి శ్రీనివాస్, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: ట్రైబల్స్ చారిటబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పేద గిరిజనులకు బుధవారం భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధినేతలు రావూరి అంజలి, రావూరి సురేష్ బాబు, సభ్యులు బొంత కృపమ్మ, అద్దంకి పద్మా తదితరులు పాల్గొన్నారు.

రేడియో, టీవీ ఆర్టిస్ట్ సర్దార్ సింగ్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం యుగంధర్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం శ్రీ మద్వి రాట్ వీర బ్రహ్మేంద్రస్వామి చరిత్ర చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ రేడియో, టీవీ ఆర్టిస్ట్ బొందిలి సర్దార్ సింగ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి లక్ష్మయ్య, కనగాల శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, ఖరీదు బాజీ శ్రీరామ్, బొందిలి రూపాబాయి, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిరూరల్: పట్టణ కేంద్రంగా ఏర్పాటైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని ఐక్యవేదిక కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు కనపర్తి అబ్రహాం లింకన్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, ఐ భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొవెరపు దేవానంద్, 28వ వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్, దేవరకొండ శంకరరావు, ఒన్నాదుల వెంకటేశ్వర్లు, బేతాళ భూషణం, షేక్ మహబూబ్ బాషా, పట్టణ అధ్యక్షుడు జూపల్లి వంశీ, మండలాధ్యక్షుడు కుర్రా జస్వంత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడిపై దాడి.. కేసు నమోదు

తెనాలిరూరల్: అల్లుడిపై అతని మామ, మరిది దాడి చేసిన ఘటనపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని నాజరుపేటకు చెందిన దుర్గారావు కుటుంబం కలహాల నేపథ్యంలో తన భార్యను ఇంట్లోకి రానివ్వలేదు. ఈ క్రమంలో మామ, బావ మరిది మంగళవారం రాత్రి తనపై దాడి చేసి, గాయపరిచారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి రైల్వేస్టేషన్ దక్షిణ క్యాబిన్ సమీపంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహంపై నల్ల ప్యాంటు, నీలం రంగు చొక్కా ఉంది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వృద్ధుడికి సంక్షేమ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 28వ వార్డు చెంచుపేట నుంచి బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ.. అర్హతే ప్రమాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. పేదల జీవన ప్రమాణాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందుకే ప్రజలు తమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 28వ వార్డులో ఇప్పటి వరకు రూ.19.24కోట్ల సంక్షేమ పథకాలు అందించినట్లు గుర్తు చేశారు. రానున్న రోజుల్లో వార్డును మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్ల పదవీ కాలాన్ని సీఎం జగన్ పెంచి..తమపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని.. తామంతా ఎల్లప్పుడు రుణపడి ఉంటామని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నడూ.. లేని విధంగా బీసీలకు ఆయన పెద్దపీట వేసి రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, షేక్ దుబాయ్‌బాబు, షేక్ ఇస్మాయేల్, పేరం సంజీవరెడ్డి, తోట రఘురామ్, కొమ్మురబత్తుని జయపాల్, దాసరి వసంతరావు, తాడిబోయిన రామయ్య, మొఘల్ ఆహ్మద్ బేగ్, కో-ఆప్షన్ సభ్యులు పెచ్చింగ్ సుభాని, 28వ వార్డు నాయకులు అహ్మద్, అబ్దుల్లా, ఖదర్‌వలి, సులేమాన్, మౌలాలి, బాబ్జి, ఈసూబ్, జాబిల్లి, అల్తాఫ్, జాబీర్, సుభాని, ఖాదర్, బుజులు, ఇర్ఫాన్, ఇమ్రాన్, అల్లాఉద్దీన్, గౌస్ మెహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా పేదల ఇళ్ల నిర్మాణం

జగనన్న కాలనీలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శివకుమార్



జగనన్న కాలనీలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని శరవేగంగా పూర్తయ్యేలా కృషిచేస్తున్నట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. పట్టణ పరిధిలోని గోలీడొంక కలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి బుధవారం అధికారులు, లబ్ధిదారులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. పర్యవేక్షకులకు నిర్ణీత సమయానికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇదే విషయం చెప్పారు. గోలీడొంక జగనన్న కాలనీలో తొలి విడతగా 1,800 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు చెప్పారు. తెనాలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 27వేల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామని గుర్తుచేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో ఇన్ని వేలమందికి ఇళ్లస్థలాలను ఇచ్చి, అందరికీ ఇళ్లు నిర్మిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. గృహనిర్మాణ సంస్థ ఈఈ భాస్కరరావు, డీఈ రఫీ, ఏఈ పిచ్చయ్య, 1వ వార్డు కౌన్సిలరు గెడ్డేటి సురేంద్ర, పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, కాకి దేవసహాయం, మేకల రవికుమార్, చింకా సురేష్‌చంద్ర యాదవ్, అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలను తీసుకొచ్చినట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 28వ వార్డు పరిధిలోని సుల్తానాబాద్‌లో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి విడదల రజని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే శివకుమార్ సందర్శించారు. అక్కడి సౌకర్యాలను, సమకూర్చిన మందులను పరిశీలించారు. అవసరమైన సూచనలు చేశారు. ఒక్కో ఆరోగ్య కేంద్రం రూ.1.10 కోట్లతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో నిర్మిస్తున్న ఆరోగ్యకేంద్రం కూడా దాదాపు పూర్తి కావొచ్చిందని చెప్పారు. మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కాకి దేవసహాయం, మేకల రవికుమార్, అక్కిదాసు కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఓటుహక్కు రాజ్యాంగం కల్పించిన గౌరవం

జాతీయ ఓటరు దినోత్సవంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



వయోజన ఓటర్లను సత్కరించిన సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: దేశానికి స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘకాలం చేసిన పోరాటంతోనే ప్రతి ఒకరికీ ఓటు హక్కు లభించిందని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యక్షత వహించిన సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ.. బ్రిటిష్ పరిపాలనలో మన దేశంలో అందరికీ ఓటు హక్కు ఉండేది కాదన్నారు. సంపన్నులు, పలుకుబడి కలిగిన వ్యక్తులకు మాత్రమే ఓటు వేసే అర్హతను కల్పించారని తెలిపారు. ఎంతో పోరాటం తర్వాత స్వాతంత్ర్యం లభించి, ప్రజాస్వామ్య పరిపాలన ఏర్పాటయ్యాక ప్రతివారికీ ఓటుహక్కును కల్పించినట్టు తెలిపారు. ఓటు అనేది ఒక గౌరవంగా భావించాలన్నారు. అందరూ తప్పకుండా ఓటు వేస్తే మంచి ప్రభుత్వం ఏర్పడుతుందని, తద్వారా ప్రజలకు మంచి జరుగుతుందని ప్రతిజ్ఞ చేయించారు. తెనాలి, కొల్లిపర తహసీల్దార్లు కె.రవిబాబు, జి.నాంచారయ్య ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. సీనియర్ ఓటర్లు.. మహాత్మా సేవా శాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, మాజీ సైనికుడు పసుపులేటి మోహనరావు, చింతపల్లి వీరభద్ర శర్మ, పిల్లుట్ల నరసింహశాస్త్రి, లక్కరాజు లక్ష్మణరావు, ఆకురాతి రామకృష్ణారావు, శ్యామలను సత్కరించారు. ఉత్తమ బీఎల్వోలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 2కె రన్ విజేతలు కేఎస్ఎం హైస్కూలు విద్యార్థులు సూరజ్, సుభాని, జగదీష్‌లకు.. వక్తృత్వ, వ్యాసచన పోటీల విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ అందజేశారు. తొలుత కేకేఆర్ గౌతమ్ స్కూలు 5వ తరగతి విద్యార్థిని షేక్ రియాజత్ శాస్త్రీయ నృత్యాంశం ప్రదర్శించగా, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు గాయత్రి, పూజిత దేశభక్తి గీతాలాపన చేశారు.

ఉత్తమ సూపర్‌వైజర్‌గా మనోహర్‌రెడ్డి



తెనాలిరూరల్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఓటరు జాబితా సవరణల్లో ఉత్తమ పని తీరు కనబరచినందుకు తెనాలి తహసీల్దార్ కార్యాలయ ఏఎస్‌వో టి.మనోహర్‌రెడ్డి ఉత్తమ సూపర్‌వైజరు అవార్డు అందుకున్నారు. గుంటూరులో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఐజీ సీఎం. త్రివిక్రమవర్మ, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఇతర జిల్లా అధికారుల సమక్షంలో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి



కొల్లిపర: ప్రతి ఒక్కరూ తమ ఓటు కార్డుకి ఆధార్ నంబరు అనుసంధానం చేసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ జి.నాంచారయ్య అధ్యక్షతన రెవెన్యూ కార్యాలయంలో మహిళలకు మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు నాంచారయ్య ఓటరు చైతన్య ప్రతిజ్ఞ చేయించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసులు, డీటీ బాలకృష్ణారెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు, భీమవరపు సంజీవరెడ్డి, తూములూరు ఎంపీటీసీ మర్రెడ్డి మాధవి, కంప్యూటర్ ఆపరేటర్లు ఈమని సురేంద్రరెడ్డి, కిషోరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి

కొల్లూరు : ట్రాక్టర్ అదుపు తప్పి పంట కాల్వలోకి దూసుకువెళ్లిన ఘటనలో గాయపడిన డ్రైవర్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చెరుకుపల్లి మండలం వాకవారిపాలేనికి చెందిన వాక అర్జునరావు (62) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కలప లోడ్‌తో మండలంలోని దోనేపూడి వైపు వస్తుండగా.. ముగ్గాలపాలెం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి.. పక్కనే ఉన్న పంట కాల్వలోకి దూసుకెళ్లింది. ట్రక్కులో ఉన్న కలప.. అర్జునరావుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరులోని ఓ ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు.

వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి వ్యూహాలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి పునరుజ్జీవనానికి స్థితిస్థాపక వ్యూహాలు అవసరమని కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎం.ఎస్ నారాయణ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో భారతీయ సాంఘిక శాస్త్రాల పరిశోధన మండలి (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహాయంతో ''సాధికార భారతదేశం -75 ఏళ్ల విజయాలు'' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.ఎస్. నారాయణ మాట్లాడుతూ 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో భారతదేశం వ్యవసాయ రంగంతో పాటు మిగిలిన సేవా రంగాల్లోనూ గణనీయాభివృద్ధి సాధించిందని తెలిపారు. వ్యవసాయ రంగ పునరుజ్జీవనానికి తీసుకోవాల్సిన చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. శాస్త్ర, సాంకేతిక ఫలాలు సామాన్యుడికి చేరువైనప్పుడే ఆశించిన ఫలితాల్ని అందుకోగలమని తెలిపారు. గత రెండు రోజులుగా వివిధ కళాశాలల నంచి వచ్చి పత్ర సమర్పణ చేసిన ఆధ్యాపకులు, పరిశోధన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి, సదస్సు కన్వీనర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, అధ్యాపకులు శ్రీనివాసరావు, రవికుమార్, నాగ నిర్మలారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను బుధవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. 'అడ్వాన్సెస్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్' అనే అంశంపై ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని విభాగాధిపతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- యూనివర్సిటీ ఐబీఎస్(ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను బుధవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ బిజినెస్' అనే అంశంపై మార్చి 24, 25 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్. శివరామ్ ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పరిశ్రమల నుంచి అధ్యాపకులు, వ్యాపార రంగ నిపుణులు హాజరుకానున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అరసం 19వ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ బాబు

తెనాలి: తెలుగునాట సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదపడిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు, ప్రవాసభారతీయుడు డాక్టర్ బాబు ఆర్. వడ్లమూడి కోరారు. ఫిబ్రవరి 11, 12 తేదీల్లో స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో జరగనున్న మహాసభల లోగోను బుధవారం ఆయన ఆవిష్కరించారు. అరసం ఆధ్వర్యంలో పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలను ప్రకటించారు. పాఠశాలల విద్యార్థులకు జరిపిన కథ చెప్పండి అనే అంశంలో పోటీల్లో ఎస్.నందిని ప్రథమ బహుమతిని దక్కించుకోగా, సీహెచ్ మౌనిక ద్వితీయ బహుమతి, ప్రిస్కిల్లారాణి తృతీయ బహుమతిని గెలుపొందినట్లు తెలిపారు. వ్యాసరచన పోటీలో ఎం.అక్షయ, ఎం.ప్రశాంతి, గ్లోరి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు. వక్తృత్వ పోటీల్లో ఎం.చైతన్య, కె.అను, ఎం.భాగ్యలక్ష్మి ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. కాలేజీల విభాగంలో జరిపిన వ్యాసరచన పోటీల్లో ఎ.రూపనందశ్రీనాథ్ ప్రథమ, బి.భవాని లక్ష్మి ద్వితీయ, షేక్ పాయిఖ తృతీయ బహుమతిని సాధించారు. వక్తృత్వ పోటీల్లో ఎం.చంద్రశేఖర్, సయ్యద్ అమానుల్లాకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, ఆహ్వాన సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీంజాని, తుమ్మల కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళను వీడియో తీసిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: స్నానం చేస్తున్న మహిళను ఓ వ్యక్తి వీడియో తీసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. తుఫాన్ నగర్‌లో నివశించే ఓ కుటుంబానికి చెందిన మహిళ బుధవారం బాత్‌రూంలో స్నానం చేస్తోంది. అదే సమయంలో అంకమ్మరావు అనే వ్యక్తి బాత్ రూము కిటికీలో నుంచి సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. గమనించిన మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలి



సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ అధికారులు

తెనాలిరూరల్: పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకూడదని మున్సిపల్, హౌసింగ్ అధికారులు సూచించారు. పెదరావూరు-1 లే అవుట్ లబ్ధిదారులు, సంబంధిత వార్డు సచివాలయాల సిబ్బందితో గృహ నిర్మాణంపై సమీక్ష సమావేశాన్ని బుధవారం తెనాలి కౌన్సిల్ హాలులో నిర్వహించారు. నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ఇళ్ల గృహ ప్రవేశాలను ఉగాది రోజు జరిగేలా చూడాలని అధికారులు లబ్ధిదారులను కోరారు. ఇందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, హౌసింగ్ ఈఈ యడ్ల భాస్కరరావు, డీఈఈ రఫీవుల్లా ఖాన్, ఏఈ పిచ్చియ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాప్టిస్ట్, లూథరన్ చర్చిల వార్షికోత్సవం



దైవజనుల ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని బాప్టిస్ట్, లూథరన్ చర్చిల వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రెండు ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక కూడికలు నిర్వహించి, సంఘస్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాప్టిస్ట్ చర్చి 31వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా.. పాస్టర్ వందూరి మోజెస్, సంఘ పెద్దలు సతీష్, రంజిత్, నాగేశ్వరరావు, వీరయ్య తదితరుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చి 19వ వార్షికోత్సవం ప్రార్థనలు చేశారు. రెవ. జయవర్ధన్ సంఘ పెద్దలు, సంఘస్తులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

ఉత్సాహంగా ఏఎన్‌యూ 'క్రాస్ కంట్రీ' రన్నింగ్ రేస్



ఏఎన్‌యూ తరపున 'క్రాస్ కంట్రీ' రన్నింగ్ రేస్‌కు ఎంపికైన క్రీడాకారులు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పురుషుల పరుగు పందెం (10 కి.మీ) బుధవారం ఉత్సాహంగా జరిగింది. వివిధ కళాశాలలకు చెందిన 40 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారని స్థానిక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ తెలిపారు. ఏఎన్‌యూ తరపున ఆరుగురిని క్రాస్ కంట్రీ రన్నింగ్ రేస్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాసకుమార్, ఉపాధ్యక్షుడు మంతెన శివరామరాజు ప్రారంభించారు.

మొదటి బహుమతిని వేటపాలేనికి చెందిన బీబీహెచ్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఏవీ నాగార్జునరెడ్డి, ఇంకొల్లు డీసీఆర్ఎం కళాశాల విద్యార్థి ఎస్.వేణుబాబు, ఖాజీపాలేనికి చెందిన కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాల విద్యార్థి సీహెచ్ తేజ.. రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ఖాజీపాలెం డిగ్రీ కళాశాల కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ క్రాస్ కంట్రీ పరుగు పందెంలో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన వారిని ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ పోటీలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరుపున ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ మంతెన కృష్ణంరాజు, ఏఎన్‌యూ యోగ కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.



విద్యార్థుల 'రిపబ్లిక్ డే' అక్షర రూపం

తెనాలిలోని సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు 'రిపబ్లిక్ డే' అక్షర సమూహంగా ఏర్పడి.. ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్‌లు చావలి అకుల్‌నాథ్, చావలి తేజోనాథ్, ప్రిన్సిపల్ టి.దివ్యతేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - తెనాలి అర్బన్

బాధిత కుటుంబానికి సాయం

పల్లికోన(భట్టిప్రోలు): మండలంలోని పల్లికోనలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన జి. శ్రీనివాసరావు పూరిల్లు దగ్ధమయ్యింది. రేపల్లె అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి ఎం. నాగేశ్వరరావు తన సిబ్బందితో మంటలను అదుపు చేశారు. తెలుసుకున్న రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున తనయుడు మేరుగ చందన్ నాగ్ బుధవారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20వేలు వ్యయం చేసే ఇంటి సామగ్రి, నిత్యావసర వస్తువులు, రూ.10వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, సర్పంచ్ రాజమ్మ, ఎంపీటీసీ తిరుపతి బాబు, బొల్లెద్దు ప్రతాప్, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పడమట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు చింతాయపాలెం విద్యార్థులు

కర్లపాలెం: బాపట్ల జిల్లా కేంద్రంలో గురువారం జరగనున్న గణతంత్ర దినోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని చింతాయపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం డి.శ్రీనివాసరావు, పీఈటీ ఎం.గోపి బుధవారం తెలిపారు.